

రైతు సంక్షేమమే లక్ష్యం

సరుబుజ్జిలి : పంట ఉత్పాదకాలను పెంచేందుకు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని రొట్టవలసలో రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని, రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని స్పీకర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పలు సంస్కరణలు తీసుకొచ్చారని కొనియాడారు. భూ యాజమాన్య హక్కులు పక్కాగా నిర్ధారించేలా ప్రభుత్వం భూ సమగ్ర రీ సర్వే చేపట్టిందన్నారు. రైతు సంక్షేమమే అంతిమ లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కె.వి.జి సత్యనారాయణ, జెడ్‌పిటిసి ఎస్.నాగేశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షులు డి.మల్లేశ్వరరావు, మార్కెట్ కమిటీ అధ్యక్షులు కృష్ణవేణి, కె.చంద్రశేఖర్ వైస్ ఎంపిపి శివానందబాబు, సర్పంచ్ భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

'వంశధార'పై ధర్మాన డ్రామాలు

- ప్రాజెక్టు పూర్తి చేయకుండా లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లు
- నారాయణపురానికి నిధులు తెచ్చినా తమ్మినేని ఏం చేశారు?
- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు
- 'భవిష్యత్‌కు గ్యారంటీ' బస్సు యాత్ర ప్రారంభం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, కొత్తూరు

వంశధార ప్రాజెక్టుపై రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు కొత్త డ్రామాలాడుతున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు. హిరమండలం మండలంలోని కల్లటలో టిడిపి భవిష్యత్‌కు గ్యారంటీ బస్సు యాత్రను శనివారం ప్రారంభించారు. అనంతరం పాతపట్నం మండలం కొరసవాడలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. వంశధార ప్రాజెక్టును పూర్తి చేయకుండా లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ఏర్పాటు చేస్తామంటూ నాటకాలకు తెర తీశారని విమర్శించారు. టిడిపి హయాంలో నారాయణపురం ఆధునీకరణకు శంకుస్థాపన చేస్తే స్పీకర్ తమ్మినేని సీతారాం నాలుగేళ్లయినా పూర్తి చేయలేకపోయారని చెప్పారు. నిర్వాసితులకు టిడిపి ప్రభుత్వం రూ.420 కోట్లు ఇస్తే 2019 ఎన్నికల్లో మాకు వాత పెట్టారని చెప్పారు. '2013 చట్టం అమలు చేసేయండి, మాకు ఇది కావాలి, అది కావాలంటే చేయలేమని, మీకు ఉన్న పెండింగ్ పరిహారం, ఇతర సమస్యలను పరిష్కరిస్తాం' అని హామీనిచ్చారు. టిడిపి అధికారంలోకి వస్తే రెండింతల సంక్షేమం అమలు చేస్తామని, పథకాలు రద్దు చేస్తారంటూ వైసిపి నాయకులు, వలంటీర్లు చేస్తున్న ప్రచారాన్ని నమ్మొద్దని హితవు పలికారు. ప్రజలు కడుతున్న పన్నులతో జీతాలు తీసుకుంటున్న వలంటీర్లు వైసిపికి, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ఊడిగం చేస్తామంటే ఖబడ్దార్ అని హెచ్చరించారు. వలంటీర్లు వచ్చి వేలిముద్రలు వేయమంటే వేయొద్దని, అలా వేస్తే మన ఇళ్లు, ఆస్తులు అమ్ముకునేందుకు జగన్మోహన్‌రెడ్డికి హక్కు కల్పించినట్లేనని చెప్పారు. వైసిపి నాలుగేళ్ల పాలనలో రాష్ట్రం 40 ఏళ్లు వెనక్కి వెళ్లిందని, రాష్ట్రాన్ని గట్టెక్కించాలంటే చంద్రబాబును గెలిపించాల్సిన అవసరముందన్నారు.

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి కిమిడి కళా వెంకటరావు మాట్లాడుతూ వైసిపికి ఒకసారి అవకాశం ఇచ్చి దాని ఫలితమేమిటో అందరికీ అర్థమైందన్నారు. వైసిపి నాలుగేళ్ల పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు, వంటగ్యాస్ సిలిండర్ రేట్లు విపరీతంగా పెరిగాయని చెప్పారు. పింఛన్ సొమ్మును చంద్రబాబు రూ.200 నుంచి రూ.రెండు వేలు చేసి రూ.1800 పెంచితే వైసిపి రూ.750 మాత్రమే పెంచిందని గుర్తు చేశారు.



జెండా ఊపి బస్సు యాత్రను ప్రారంభిస్తున్న అచ్చెన్నాయుడు

వైసిపి మోసాన్ని ప్రజలు గుర్తించారు : ఎంపీ

నాలుగేళ్ల వైసిపి పాలనలో జరిగిన మోసాన్ని ప్రజలు గుర్తించారని, అందుకే బస్సు యాత్రకు జనం బ్రహ్మరథం పడుతున్నారని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. పాతపట్నం నియోజకవర్గంలో నాలుగేళ్లుగా చేసేందేమీ లేదని విమర్శించారు. కొరసవాడలో ఎంపీ ల్యాడ్స్ నిధులతో ఒక భవనాన్ని నిర్మించాలని భావిస్తే, దాన్ని అడ్డుకున్నారని తెలిపారు. పాతపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జి కలమట వెంకటరమణ మాట్లాడుతూ వంశధార నిర్వాసితులకు రూ.216 కోట్లు తెచ్చామని చెప్తున్నా, 40 శాతం మందికి ఇంకా ఇవ్వలేదని చెప్పారు. నియోజకవర్గానికి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు టిడిపి హయాంలో నిధులు ఇచ్చినా ఇప్పటికీ పూర్తి చేయలేకపోయారని విమర్శించారు.

బస్ షెల్టర్లు ప్రారంభం

పాతపట్నం మండలం ధనుపరం, కొరసవాడలో ఎంపీ ల్యాడ్స్‌తో నిర్మించిన బస్సు షెల్టర్లను నేతలు ప్రారంభించారు.

సెల్ఫీ ఛాలెంజ్‌లు

టిడిపి హయాంలో బొంతు ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయించినా, నాలుగేళ్లలో ఒక్క రూపాయి ఖర్చు చేయకుండా పథకాన్ని వైసిపి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందంటూ నేతలు సెల్ఫీ దిగారు. ఐదేళ్లయినా ప్రారంభానికి నోచుకోని పాతపట్నం బిసి మహిళల వసతిగృహం వద్ద సెల్ఫీ తీసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, శ్రీకాకుళం, పలాస, నరసన్నపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు గుండ లక్ష్మీదేవి, గౌతు శిరీష, బగ్గు రమణమూర్తి, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, హిరమండలం జెడ్‌పిటిసి బుచ్చిబాబు, నాయకులు మెండ దాసునాయుడు, ఎ.భైరాగినాయుడు, పి.మోహనరావు, మాతల గాంధీ, పైల బాబ్జీ, శివ్వాల తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శనగా వెళ్తున్న మున్సిపల్ కార్మికులు

ఆప్కాస్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలి

- మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నూకరాజు
- ఘనంగా ఫెడరేషన్ 4వ జిల్లా మహాసభ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఏళ్ల తరబడి మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు, నగర పంచాయతీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ (ఆప్కాస్) కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.నూకరాజు, రాష్ట్ర కార్యదర్శులు ఎన్.వై నాయుడు, వి.రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫెడరేషన్ జిల్లా నాలుగో మహాసభల సందర్భంగా శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి బాపూజీ కళామందిర్ వరకు డప్పు వాయిద్యాలతో మున్సిపల్ కార్మికులు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం బాపూజీ కళామందిర్‌లో నిర్వహించిన మహాసభలో వారు మాట్లాడారు. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు అనే పదాల్లో తేడా తప్ప చదువులు, పనులు ఒకటేనని చెప్పిన ముఖ్యమంత్రి మున్సిపాల్టీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయకపోవడం మోసపూరిత చర్య అని విమర్శించారు. 30 ఏళ్లుగా మురుగుకూపాల్లో పనిచేస్తూ రాష్ట్ర జనాభాలో 40శాతం ప్రజల అవసరాలను తీరుస్తున్న మున్సిపల్ కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి కరువైందన్నారు. మున్సిపల్ కార్మికులు తమ ప్రాణాలకు తెగించి పనిచేస్తున్నా, ప్రభుత్వం వారి విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు కార్మికులను, శాశ్వత స్వభావం కలిగిన మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, అవుట్ సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ 010 ద్వారా జీతాలు చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్లు అమలు చేయాలని, ఇంజనీరింగ్ కార్మికులకు హెల్త్ , రిస్క్ అలవెన్స్, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. క్లాప్ ఆటో డ్రైవర్లకు రూ.18,500 వేతనం చెల్లించాలన్నారు. మహాసభలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, కార్యదర్శి ఎన్.వి రమణ జిల్లా కోశాధికారి ఎ.సత్యనారాయణ మాట్లాడారు.

ఏకగ్రీవంగా నూతన కమిటీ ఎన్నిక

మహాసభలో ఫెడరేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా పి.తేజేశ్వరరావు, అధ్యక్షులుగా రమేష్ పట్నాయక్, ఉపాధ్యక్షులుగా ఎ.గణేష్, సిహెచ్.మురుగన్, ఎ.రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శిగా ఎన్.బలరాం, సహాయ కార్యదర్శులుగా బి.కూర్మారావు, కళ్యాణ రాజు కోశాధికారిగా టి.సంతోష్, కమిటీ సభ్యులుగా గంగాధర్ రథో, ఎం.రవి, జె.వాసు, డి.యుగంధర్, కె.రాజు, ఎ.రాము, ఎల్.రవి ఎన్నికయ్యారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

21 నుంచి ఇంటింటి ఓటర్ల నమోదు

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఈనెల 21 నుంచి వచ్చే నెల 21వ తేదీ వరకు బిఎల్‌ఒలు తమ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలు సేకరించాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. ఇందులో వాలంటీర్లను వినియోగించరాదని, స్వయంగా బిఎల్‌ఒలే వెళ్లాలని స్పష్టం చేశారు. బిఎల్‌ఒలు, ఇఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలతో కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శనివారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2024 ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమంలో భాగంగా ఈనెల 21 నుంచి ప్రతి బిఎల్‌ఒ వారి పరిధిలోని ప్రతి ఇంటినీ సందర్శించి, ఓటర్ల వివరాలు సేకరించాలన్నారు. ఓటర్ల మార్పులు, చేర్పులను పరిగణనలోకి తీసుకోవాలని, కొత్త ఓటర్లు ఉంటే వాటిని నమోదు చేయాలని సూచించారు. ఇంటి నంబరు సరిచూసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి బుధవారం నియోజకవర్గ పరిధిలోని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం కావాలన్నారు. ఆ వారంలో సేకరించిన ఓటర్ల వివరాలు, చేసిన మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల వివరాలను ఇప్పట్నుంచి తుదిజాబితా ప్రచురణ అయ్యేంత వరకు వారికి అందజేయాలని సూచించారు. వారికి సమర్పించిన ఓటర్ల వివరాలు, మినిట్స్, సమావేశం ఫొటోలను తమకు సమర్పించాలని ఆదేశించారు. ఓటర్ల నమోదుకు వెళ్లే బిఎల్‌ఒలు ముందుగా పర్యటనను ఖరారు చేసుకుని, ఆయా గ్రామస్తులకు రెండు రోజుల ముందే తెలియజేయాలన్నారు. గ్రామాల్లోకి వెళ్లే అధికారులు తప్పనిసరిగా యూనిఫాం, గుర్తింపుకార్డును తీసుకువెళ్లాలని కలెక్టర్ వివరించారు.

జీడి రైతుల సమస్యలపై మౌనమేల?

ప్రజాశక్తి - మందస



మద్దతు ధర లేక జీడి రైతులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నా జిల్లాకు చెందిన మంత్రులు సీదిరి అప్పలరాజు, ధర్మాన ప్రసాదరావు, శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం ఎందుకు స్పందించడం లేదని ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు, జీడి రైతుసంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ ప్రశ్నించారు. జీడికి మద్దతు ధర కల్పించాలని, రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన జీపుజాతా రెండో రోజు మందస మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సాగింది. జాతాకు గ్రామాల్లో అపూర్వ ఆదరణ లభిస్తోంది. జాతా సాగిన ప్రతిచోటా పెద్దసంఖ్యలో జీడి రైతులు, ప్రజలు హాజరవుతున్నారు. ఎర్రముక్కాంలో నిర్వహించిన సభలో వారు మాట్లాడుతూ జీడికి గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు తీవ్రంగా దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీడి పరిశ్రమల యాజమాన్యాలు జీడి రైతులను తీవ్రంగా దోచుకుంటున్నయన్నారు. ఈనెల 18న కాశీబుగ్గ సంత మైదానంలో నిర్వహించే మహా ధర్నాలో జీడి రైతులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

చెక్‌పోస్ట్‌లో నగదు రహిత లావాదేవీలు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

సరిహద్దు రవాణా శాఖ చెక్‌పోస్టుల్లో ఈనెల 12వ తేదీ నుంచి నగదు రహిత లావాదేవీలు చేపడుతున్నట్లు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఎస్.శివరాం ప్రసాద్ వెల్లడించారు. ఇచ్ఛాపురం సరిహద్దులోని పురుషోత్తపురం రవాణా చెక్‌పోస్టులో ఆన్‌లైన్ చెల్లింపుల విధానంపై లారీ డ్రైవర్లకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇకపై వాహనదారులు సరిహద్దు రవాణా తనిఖీ కేంద్రం వద్ద ట్యాక్స్ చెల్లించేందుకు వేచి ఉండాల్సిన అవసరం లేదన్నారు. రవాణా శాఖకు సంబంధించిన తాత్కాలిక పర్మిట్లు, వాలంటరీ ట్యాక్స్‌లు, అపరాధ రుసుములు ఇతర చెల్లింపులు ఆన్‌లైన్ విధానంలో చేయవచ్చని చెప్పారు. ఈ విధానంపై అవగాహన కలిగే వరకు తనిఖీ కేంద్రాల వద్ద సిఎస్‌ఇ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటివరకు చేపట్టిన నగదు లావాదేవీల విధానం వల్ల ఇబ్బందులు ఉండేవన్నారు. బ్యాంకులు సెలవు రోజుల్లో వచ్చిన ట్యాక్స్ డబ్బులు జమ చేసేంత వరకు ఉండాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఆన్‌లైన్ చెల్లింపుల విధానాన్ని గమనించి డ్రైవర్లు సహకరించాలని కోరారు. ఆయనతో పాటు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రంగారావు, వి.వెంకటరావు, ఎం.అనిల్ కుమార్ ఉన్నారు.



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న డిటిసి శివరాం ప్రసాద్

రాష్ట్రస్థాయి ఉషు పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

జీవన విధానంలో వస్తున్న మార్పుల కారణంగా పిల్లలు మానసిక ఎదుగుదల లేకుండా పోతుందని, ఈ తరుణంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చదువుతో పాటు ఏదైనా క్రీడల్లో విధిగా చేర్పించాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు పిలుపునిచ్చారు. మండలంలోని ఒప్పంగిలో రాష్ట్రస్థాయి ఉషు పోటీలను శనివారం ప్రారంభించారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న పోటీలకు ఉమ్మడి 13 జిల్లాల నుంచి 285 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలు పిల్లలను బందీలుగా మార్చి విద్యను అందిస్తున్నాయని, వీటివల్ల మానసిక ఎదుగుదల లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపి పిల్లలకు ఇష్టమైన క్రీడల్లో ప్రావీణ్యం పొందాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయి ఉషు పోటీలు శ్రీకాకుళంలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉషు అసోషియేషన్ ప్రతినిధులు రెడ్డి శివకుమార్, కొమర భాస్కరరావు, పి.కృష్ణంనాయుడు, వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు జి.ఇందిరాప్రసాద్, ఎస్.జోగినాయుడు, బి.వి.రవిశంకర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.సురేఖ, పిఇటిల సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.వి రమణ తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అతి తక్కువ ధరకే నాణ్యమైన (సూపర్ ఫైన్ రకం) బియ్యాన్ని ప్రజలకు అందించనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. స్థానిక రైతుబజారులో ఏర్పాటు చేసిన బియ్యం విక్రయ కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలు అధికంగా ఉన్నాయని, వీటిని అరికట్టేందుకు, సాధారణ ప్రజానీకానికి తక్కువ ధరకే బియ్యం కొనుగోలు చేసుకునేలా ఈ కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఇందులో సాధారణ రకం బియ్యం రూ.35 కాగా, బిపిటి రకం బియ్యం రూ.48కు అందించనున్నట్లు చెప్పారు. రైతుబజారుతో పాటు నగరంలోని మరో మూడు కేంద్రాల్లో బియ్యాన్ని విక్రయించనున్నట్లు తెలిపారు. ఆమదాలవలస, కోటబొమ్మాళి రైతుబజార్లలో సోమవారం నుంచి విక్రయ కేంద్రాలను ప్రారంభిస్తున్నామన్నారు. బియ్యం ధరల నియంత్రణ కోసం కమిటీని వేశామని తెలిపారు. ఈ కమిటీ విక్రయ కేంద్రాలను తనిఖీ చేస్తుందని చెప్పారు. అనంతరం కొనుగోలుదారులకు బియ్యం ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సరఫరాల అధికారి డి.వి రమణ, మార్కెటింగ్ ఎడి కైలాసరావు, డిఎం సివిల్ సప్లై, జిఎస్‌టి అధికారి రాణిమోహన్, డిటి గోపాల్, రైతుబజారు ఇఒ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

22న ప్రత్యేక లోక్‌అదాలత్

శ్రీకాకుళం లీగల్, అర్బన్ : ఈనెల 22వ తేదీన ప్రత్యేక లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. ప్రత్యేక లోక్‌అదాలత్‌కు సంబంధించి పలు ప్రభుత్వ శాఖల అధికారులతో జిల్లా కోర్టులోని సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇన్సూరెన్స్, రోడ్డు ప్రమాద, భూసేకరణ చట్టం కింద కేసులు ఈ ప్రత్యేక లోక్‌అదాలత్‌తో రాజీ చేయనున్నట్లు తెలిపారు. న్యాయస్థానాల తీర్పు కంటే సత్వర, ఖర్చు లేని న్యాయం అందించేందుకు సాధ్యమవుతుందన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి అధికారి కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.జ్ఞానశ్రీ సువర్ణరాజు జిల్లా అధికారులకు సూచించారు. శాశ్వత లోక్ అదాలత్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన హై లెవల్ కమిటీ సమావేశం న్యాయ సేవా సదన్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రయోజన సేవలకు భంగం వాటిల్లితే, ఆ వ్యక్తి శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించవచ్చన్నారు. ఎటువంటి కేసులనైనా 90 రోజుల్లో పరిష్కారమవుతాయని తెలిపారు. సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు, ప్యానల్ న్యాయవాదులు, పలు శాఖల అధికారులు హాజరయ్యారు.



మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

వెంటాడుతున్న దిగులు



నేటి అస్థిత్వ రాజకీయాలు ప్రధాన పార్టీల్లో పలువురు నేతలను అయోమయంలో పడేస్తున్నాయి. అధికార పార్టీలోని కొందరు నేతలకు దిగులు పట్టుకున్నట్లు తెలిసింది. వైనాట్ 175 నినాదం రాజకీయ వ్యూహంలో భాగమేనని, జిల్లాలో అందుకు భిన్నమైన పరిస్థితులు కొన్ని నియోజకవర్గాల్లో కనిపిస్తున్నాయని కొందరు అధికార పార్టీ నేతలే చెప్తున్నారు. అధినేత ఎంతటి భరోసా ఇచ్చినా, దిశానిర్దేశం చేసినా జిల్లాలో గ్రూపుల గోల సమసిపోయే పరిస్థితి కనిపించడం లేదు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో గ్రూపుల గోలను అంతమొందించేందుకు నర్తు రామారావుకు ఎమ్మెల్సీ పదవిని కట్టబెట్టినా, అది అంతం కాలేదన్న వాతావరణం నేటికీ కనిపిస్తోంది. సామాజిక తరగతుల ఆధిపత్య పోరులో సామాజిక తరగతుల్లోని చీలికలు సాధారణమైన విషయం. జిల్లాలో ఏ సామాజిక తరగతి కూడా ఏకపక్షంగా ఒకే రాజకీయ పార్టీకి గొడుగు పట్టడం ఏనాడూ జరగలేదు. ఇక ముందూ జరగదు. ఇది చరిత్ర చెప్పున్న సత్యం. అయినా సామాజిక తరగతుల వారీ గ్రూపులు కట్టడం, అందులోనూ ఆధిపత్య పోరు ప్రదర్శించడం ఇచ్ఛాపురం నియోజకవర్గ రాజకీయాలకు ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. సానుకూల వాతావరణంగా మారుతుందని పదవులను కట్టబెట్టినా, నేటికీ ప్రతికూల వాతావరణంగానే ఉందని రాజకీయ విశ్లేషకుల అంచనా. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ రాజకీయ పరిణామాలు ఏరూపంలో ఎన్ని మలుపులు తిరుగుతాయో చూడాల్సి ఉంది. అధికార పార్టీకి టెక్కలి నియోజకవర్గం మరో సరికొత్త ఫజిల్‌గా మారిందని తెలుస్తోంది. భార్యాభర్తల మధ్య ఇన్‌ఛార్జి పదవిని ఇచ్చిపుచ్చుకున్నా, వైసిపి అభిమానుల్లో మాత్రం అది ఇంకా మరో రూపాంతరంలో ఆవిర్భవిస్తుందేమోనన్న ఆలోచనల్లో అయోమయంలో ఉన్నట్లు తెలిసింది. అభ్యర్థి మార్పును ప్రకటించకున్నా, అది తమ పూర్తి విజయంగా అసమ్మతి నేతలు భావించడం లేదని తెలిసింది. ఆధిపత్యాన్ని తగ్గించగలిగామన్న తృప్తి మాత్రం వారిలో ఉంది. మళ్లీ టిక్కెట్ ఇస్తే ఓడిస్తామన్న అమస్మతి నేతలు, అధినేత పర్యటనల్లో రెండుసార్లు అభ్యర్థిని ప్రకటించడంతో కొంత అయోమయంలో ఆనాడు పడ్డారని తెలిసింది.

ఐప్యాక్ అంతర్గత సర్వేలో ఇచ్ఛాపురంతో పాటు టెక్కలి కూడా సంతృప్తికరంగా లేదని సమాచారం. ఆ మాటనే జిల్లాలోని కొందరు సీనియర్ నేతలు చెప్తున్నారు. అయితే ఇప్పటి సర్వేల వాతావరణం స్థిరంగా ఉంటుందని చెప్పలేం. ఉండదు కూడా. అసమ్మతి నేతల వ్యవహారశైలిని బట్టి మరింత సానుకూలమైనా కావచ్చు. లేదంటే ప్రతికూలమైనా పెరగవచ్చు. వైసిపిలో గ్రూపుల గోల పాతపట్నం నియోజకవర్గంలో నివురుగప్పిన నిప్పులా ఉందని తెలిసింది. ఆయా మండలాల్లో అసమ్మతిరాగం బలంగా వీస్తున్నా, నియోజకవర్గ స్థాయిలో అసమ్మతి రాగం ఆలపించే నాయకులు కనిపించడం లేదు. అంటే ప్రత్యామ్నాయంగా స్థానికులు ఎవరూ ముందుకొచ్చే పరిస్థితి కనిపించడం లేదు. స్థానికులే ఆ నియోజకవర్గంపై ఆశలు పెంచుకుని అడపాదడపా నియోజకవర్గంలో అడుగు పెడుతున్నారు. ఎంతటి అసమ్మతిరాగం ఆలపించినా, అభ్యర్థిని మార్చే అవకాశాలు ఏ కోశానా కనిపించడం లేదు. సర్వేల్లో గ్రూపుల గోలతో కాస్త అటుఇటుగా కనిపిస్తున్నా, అభ్యర్థి మార్పు ఉండదని ఆ పార్టీ సీనియర్లు చెప్తున్నారు. అధినేతకు ఆ కుటుంబంతో అలాంటి మంచి సంబంధాలు ఉన్నాయని చెప్తున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలోని మండలాల్లో అసమ్మతిరాగం బలంగా ఉన్నా ఎవరూ ప్రత్యామ్నాయంగా వచ్చే పరిస్థితి గానీ, తెర పైకి తెచ్చే పరిస్థితి గానీ ఇంతవరకు రాలేదు. అందువల్ల ఎంతటి రాగం అందుకున్నా చివరికి సానుకూల రాగం అందుకోవాల్సిందేనని సీనియర్లు చెప్తున్నారు.

ఆమదాలవలసలో అసమ్మతిరాగం ఒక దశలో గట్టిగా వినిపించినా మంత్రి బొత్స వైద్యంతో అది కూనిరాగానికి పడిపోయినట్లు తెలుస్తోంది. జిల్లాలో కొన్ని నియోజకవర్గాల్లో అసమ్మతిరాగం వినిపిస్తున్నా, దాని వెనుక అదే పార్టీలోని ఒక ప్రధాన సామాజిక తరగతి నేతలు ప్రోత్సహిస్తున్నారన్న అభిప్రాయం జిల్లాలో ఉంది. నరసన్నపేట నియోజకవర్గంలో అసమ్మతి ఉన్నా, అది అంతగా వెలుగులోకి రాకపోవడానికి అదే కారణమని తెలిసింది. ఒక సామాజిక తరగతి నేతలు కొందరు ఇతర సామాజిక తరగతుల్లో గ్రూపులు సృష్టించి రాజకీయాలు నడుపుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఈ గ్రూపుల గోలలో ప్రభుత్వ కార్యక్రమాలు నేతలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం జగనన్న సురక్ష కార్యక్రమం సాగుతోంది. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వలంటీర్ల వ్యవస్థపై చేసిన వ్యాఖ్యలతో ఈ కార్యక్రమానికి అంతగా ప్రచారం లభించలేదని, ఆమేరకు కొంత నష్టం వాటిల్లిందని కొందరు నేతలు చెప్తున్నారు. ఎన్నికల వరకు ప్రతినెలా ఏదో ఒక కార్యక్రమాన్ని ప్రభుత్వం నేతల ముందుంచనున్నట్లు తెలిసింది. ప్రతి కార్యక్రమంలోనూ ప్రభుత్వ భాగస్వామ్యం ఉండేలా కార్యక్రమాలు రూపొందించనున్నట్లు తెలిసింది. వచ్చే నెలలో ఓటర్ల జాబితాల పరిశీలన పేరుతో కార్యక్రమం రూపొందించనున్నట్లు తెలిసింది.

- సత్తారు భాస్కరరావు



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

యుద్ధంలో మృతి చెందిన సైనిక కుటుంబాలకు నివాస స్థలాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా నుంచి సైనికోద్యోగులుగా పనిచేస్తూ యుద్ధంలో మృతి చెందిన వారి కుటుంబాలకు 300 చ.అ నివాస స్థలాలను మంజూరు చేస్తామని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. కలెక్టరేట్‌లోని జిల్లా సైనిక బోర్డు సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదేళ్లకు పైబడి మాజీ సైనికుని కోటాలో మంజూరైన భూములను 22ఎ నుంచి తొలగించేందుకు ప్రతిపాదనలు పంపించాలని అధికారులను ఆదేశించారు. మాజీ సైనికుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్టు తెలిపారు. సమావేశంలో జెసి నవీన్, డిఆర్‌ఒ మురళీకృష్ణ, అదనపు ఎస్‌పి విఠలేశ్వరరావు, జిల్లా సైనిక సంక్షేమాధికారి ఎ.శైలజ పాల్గొన్నారు.

19న జాబ్‌మేళా

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా కేంద్రంలోని డిఎల్‌టిసి కేంద్రంలో ఈ నెల 19న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పనాధికారి కొత్తలంక సుధ ఒక ప్రకటనలో తెలిపారు. జయభేరి ఆటోమోటివ్స్, మెడిప్లస్ సంస్థల్లో ఉద్యోగ నియామకాలకు ఎంపికలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఐటిఐ, డిప్లమో, బిటెక్ మెకానికల్ పూర్తి చేసిన అభ్యర్థుఉ జిల్లాలో పనిచేసేందుకు వీలుగా అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఫార్మసీ పూర్తి చేసిన వారికి మెడిప్లస్ ఉత్తరాంధ్ర జిల్లాలో పనిచేసేందుకు వీలు కల్పిస్తున్నట్టు చెప్పారు. మరిన్ని వివరాలకు జిల్లా ఉపాది కల్పనా కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.



మాట్లాడుతున్న భీమారావు

మేధాశక్తికి చెస్ దోహదం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

చెస్‌తో మేధాశక్తి, విజ్ఞాన పరిజ్ఞానం, వ్యూహాత్మకత పెంపొందుతాయని సామాజికవేత్త డాక్టర్ సూర శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని పిఎన్ కాలనీలో ఉన్న న్యూసెంట్రల్ స్కూల్‌లో చౌదరి సత్యనారాయణ జయంతిని పురస్కరించుకొని రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్‌ను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీను మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలూ అవసరమని అన్నారు. క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసాన్ని కలిగిస్తాయని చెప్పారు. ప్రపంచంలోనే అత్యధిక ప్రజాదరణ పొందుతున్న ఆటల్లో చెస్ కూడా ఒకటి అన్నారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి చెస్ వంటి క్రీడలపై దృష్టిసారించి తమ మేధోశక్తిని, జ్ఞాపకశక్తిని పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ చౌదరి ధనలక్ష్మి, ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చౌదరి పురుషోత్తంనాయుడు, చౌదరి సతీష్, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, సనపల భీమారావు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో అర్హులకు న్యాయం

ప్రజాశక్తి- ఆమదాలవలస

జగనన్న సురక్షతో అర్హులకు న్యాయం అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని కొర్లకోటలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్షలో పాల్గొని మట్లాడారు. సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించడానికే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయాల ద్వారా ప్రజల ముంగిటికే పాలనను తీసుకువచ్చారన్నారు. గతంలో మండల కేంద్రంలో లభించే సేవలను గ్రామంలోనే అందేటట్లు చేశారన్నారు. విద్యార్థుల చదువులకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను మీ గ్రామంలోనే అందేటట్లు జగనన్న సురక్ష నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం 11 రకాల ధ్రువపత్రాలను అందజేశారు. ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసం –వు, మండల సచివాలయాల కో–ఆర్డినేటర్ బొడ్డేపల్లి నిరంజన్ బాబు, డిసిఎంఎస్ డైరెక్టర్ బోడ్డేపల్లి నారాయణ రావు, సర్పంచ్ సనపల అన్నపూర్ణ, ఎంపిటిసి అన్నెపు భాస్కరరావు, సువ్వారి నేతాజీ, ఎంపిడిఒ ఎస్.వాసుదేవ రావు, మండల ఎఒ మెట్ట మోహనరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : శ్రీకాకుళం రూరల్ మండలం కిష్టప్పపేట, తండ్యాలపేట, ఒప్పంగి, గౌతమినగర్, నగరంలోని ఎల్‌బిఎస్ కాలనీల్లో నిర్వహించిన జగనన్న సురక్షలో రెవెన్యూ మంత్రి ధర్మాన పాల్గొన్నారు. కార్యక్రమంలో 11 రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ధర్మాన రామ్ మనోహర్‌నాయుడు, అంబటి శ్రీనివాసరావు, గొండు రఘురాం, నిర్మల, ఎఎంసి చైర్మన్ ముకళ్ల తాతబాబు పాల్గొన్నారు.



పలాస : ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ఎంపిపి ప్రవీణ



జలుమూరు : ధ్రువపత్రాన్ని అందజేస్తున్న పద్మప్రియ

జలుమూరు: మండలంలోని పాగోడు సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న సురక్షలో వైసిపి సిఇసి రాష్ట్ర మెంబర్ ధర్మాన పద్మప్రియ పాల్గొని 11 రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి వాన గోపి, మండల కన్వీనర్ కనుసు సీతారాం, వైస్ ఎంపిపి తంగి మురళీకృష్ణ, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షులు దామ మన్మథరావు, విఠల్‌రావు, తహశీల్దార్ బి.సత్యం, ఎంపిడిఒ ఎల్.వి.అప్పారావు పాల్గొన్నారు.

పొందూరు: పొందూరు మేజర్ పంచాయతీలో సర్పంచ్ రేగడి లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన జనన్న సురక్షలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు పాల్గొని 11 రకాల ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సీపాన హరిహరరావు, ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, మండల వైసిపి అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు గాడు నాగరాజు, వైస్ ప్రెసిడెంట్ అనకాపల్లి గోవిందరావు, కార్యదర్శి ఎస్.రమేష్ పాల్గొన్నారు.

టెక్కలి : మండలంలోని బొప్పాయిపురం పంచాయతీలో నిర్వహించిన జగగన్న సురక్షలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి పాల్గొన్ని వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు. సమావేశంలో ఎంపిడిఒ హనుమంతు వెంకటరమణమూర్తి, తహశీల్దార్ కురమాన ప్రవల్లికాప్రియ, సర్పంచ్‌లు మోహన్‌రెడ్డి, దల్లి లోకేశ్వరరెడ్డి, రౌతు జయమోహన్, పొట్నూరు. భూలక్ష్మి పాల్గొన్నారు.

జి.సిగడాం: జగనన్న సురక్షతో ప్రజలకు సత్వర సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. మండలంలోని బాతువ, గెడ్డకంచరాం గ్రామాల్లో శనివారం నిర్వహించిన జగనన్న సురక్షలో పాల్గొని మాట్లాడారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. అనంతరం 11 రకాల ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకా ఆహ్వానితుడు మీసాల వెంకట రమణ, జెడ్‌పిటిసి కాయల వెంకటరమణ, ఎంపిటిసి బి.అప్పారావు, పిఎసిఎస్ అధ్యక్షుడు పల్లెన సన్యాసిరావు, శాంతారావు, జెసిఎ కన్వీనర్ డోల వెంకటరమణ, నక్క ప్రసాద్, ఎంపిడిఒ కె.నిశ్చెల, తహశీల్దార్ పప్పల వేణుగోపాలరావు, డిటి ఎన్.నిర్మల, కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పలాస : మున్సిపాలిటీ పరిధిలో పూజారివీధి, బత్తులవీధిల్లో నిర్వహించిన జగనన్న సురక్షలో చైర్మన్ బల్ల గిరిబాబు పాల్గొని 11 రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ విప్ దుర్గాశంకర్ పండా, కౌన్సిలర్లు శార్వాణి గీత, బెల్లాల శ్రీనివాస్, సనపల సింహాచలం, లోకనాథం బెహరా, కమిషనర్ టి.నాగేంద్ర కుమార్, టిపిఒ సీతారాం పాల్గొన్నారు. మండలంలోని లక్ష్మీపురం పంచాయతీలో నిర్వహించిన జగనన్న సురక్షలో ఎంపిపి ఉంగ ప్రవీణ లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు కార్యక్రమంలో గరుడఖండి సర్పంచ్ బొత్స రాజేశ్వరి, ఎంపిటిసి గొండు మోహనరావు, సర్పంచ్‌లు కొర్ల సంతోష్‌కుమార్, సచివాలయం మండల కన్వీనర్ దువ్వాడ రవి కుమార్, మండల ప్రత్యేక అధికారి పోతనపల్లి చంద్రశేఖర్, ఎంపిడిఒ రమేష్‌నాయుడు, డిటి లక్ష్మీనారాయణ, పంచాయతీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, ఎఒ పోలారావు పాల్గొన్నారు.



ఆమదాలవలస : ధ్రువపత్రాన్ని అందజేస్తున్న స్పీకర్ సీతారాం

నందిగాం : గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక టిడిపి, జనసేన పార్టీల నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి అన్నారు. మండలంలోని కల్లాడలో సర్పంచ్ మడపాల తిరుపతిరావు అధ్యక్షతన నిర్వహించిన జనగన్న సురక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 11 రకాల ధ్రువపత్రాలను అందజేశారు. వైస్ ఎంపిపి రేగల లక్ష్మీకాంతం, ఎంపిటిసిలు విష్ణు, సైలాడ లావన్న, రైతు సంఘం అధ్యక్షులు శ్యామసుందరరావు, ఇఒపిఆర్‌డి రాజారావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని అక్కయ్యవలసలో నిర్వహించిన జగనన్న సురక్షలోఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, తహశీల్దార్ జామి ఈశ్వరమ్మలు 11 రకాల ధ్రువపత్రాలను అందజేశారు.



పొందూరు : ధ్రువపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

'గరిమెళ్ల' స్ఫూర్తితో ప్రజా చైతన్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

గరిమెళ్ల స్ఫూర్తితో ప్రజల్లో చైతన్యం పెంచాలని ప్రియాగ్రహారం గరిమెళ్ల మెమోరియల్ ట్రస్టు కార్యదర్శి బాడాన రాజు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సభా అధ్యక్షులు వి.జె.కె.మూర్తి అధ్యక్షతన గరిమెళ్ల జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వతంత్ర ఫలాలు ప్రజలకు అందడానికి, ఆ విలువలను కాపాడుకోవడానికి గరిమెళ్ల సత్యనారాయణ త్యాగాలను భావితరానికి తెలియజేయాల్సిన అవసరముందన్నారు. ఈ సందర్భంగా గరిమెళ్ల జీవిత విశేషాలను, స్వతంత్ర ఉద్యమంలో నిర్వహించిన పాత్రను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కృష్ణవేణి మాట్లాడుతూ గరిమెళ్ల ఆశయాలను ముందుకు తీసుకుపోవాలని విద్యార్థులకు ఉద్బోధించారు. గరిమెళ్ల మనుమలు అశోక్, లక్ష్మణ్ ప్రత్యేక అతిథిగా పాల్గొని గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం కృషిని అభినందించారు. కళాశాల అధ్యాపకులు హేమసుందరరావు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం గరిమెళ్ల జయంతి సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు, మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందించారు. తొలుత గరిమెళ్ల చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం సహాయ కార్యదర్శి పి.సుధాకరరావు పాల్గొన్నారు

పోలాకి : భారత స్వాతంత్ర్య పోరాటంలో సిక్కోలు పౌరుషాగ్ని అని గరిమెళ్ల సత్యనారాయణ అని, ఆయన ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తి అనిగరిమెళ్ల ట్రస్టు కార్యదర్శి బాడాన రాజు అన్నారు. గరిమెళ్ల 130వ జయంతిని పురస్కరించుకుని ఆయన స్వగ్రామం ప్రియాగ్రహారంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. త్వరలో గరిమెళ్ల పేరిట ప్రత్యేక తపాలా ముద్రికను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఎంపిటిసి సుంకర ప్రసాదరావు మాట్లాడుతూ గరిమెళ్ల పేరిట ప్రియాగ్రహారంలో వృద్ధ, అనాథాశ్రమాలను ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. కళాశాల ప్రిన్సిపాల్ హేమంత్, గరిమెళ్ల ట్రస్టు సభ్యులు ఐ.గణపతిరావు, మాజీ సర్పంచ్ లావేటి కృష్ణారావు, దుబ్బ కోటేశ్వరరావు, ధనుంజయరావు, గౌరీశంకర్ పాల్గొన్నారు. అనంతరం ఇంటర్, పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు దుండంగి వాణి, సీపాన అనూష, అనింగి సాయి రోషన్‌లకు గరిమెళ్ల మెరిట్ పురస్కారాలు, నగదు బహుమతులు ప్రదానం చేశారు.



చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న వి.జి.కె మూర్తి, తదితరులు

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని శాంతినగర్ కాలనీ గాంధీ మందిరంలో గరిమెళ్ల విరగహానికి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎన్ని సూర్యారావు, ఎపి బిసి న్యాయవాదుల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చౌదరి లక్ష్మణరావు, ఇండియన్ అసోసియేషన్ లాయర్స్ రాష్ట్ర సభ్యుడు కూన అన్నంనాయుడు, న్యాయవాదులు బి.వి.రమణ, కె.అప్పలనాయుడు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.



రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్



పకీరు (ఫైల్)

మండలంలోని బొప్పాయిపురం జాతీయ రహదారి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్యామసుందరాపు రానికి చెందిన అడపా పకీరు (56) మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పకీరు బొప్పాయిపురంలో నిర్వహించిన జగనన్న సురక్షకు వెళ్లేందుకు రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తుంది. ఈ సమయంలో టెక్కలి నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు బలంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డాడు. వెంటనే స్థానికులు టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి పకీరు మృత్యువాత పడ్డారు. మృతుడికి భర్త బాబాజీ ఉన్నారు. ఎస్‌ఐ–2 కె.రమేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో ముగ్గురు అరెస్టు

టెక్కలి రూరల్ : స్థానిక పాలకేంద్రం సమీపంలో ఈ నెల 13న రాత్రి కోరాడ సతీష్ అనే వ్యక్తి ద్విచక్రవాహనం నిలుపుదల చేసి అతనిపై దాడి చేసి నగదను, బ్యాగును చోరీ చేసిన కేసులో ముగ్గురు వ్యక్తులను శనివారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ ఎల్.రామకృష్ణ తెలిపారు. సిసి కెమెరాల ఆధారంగా చోరీకి పాల్పడిన వ్యక్తులు కర్రి భోగేశ్వరరావు (సీతారాంపల్లి), టెక్కలికి చెందిన సానిల పవన్, గేదెల కుమార్లను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.8 వేలు నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

జూదరుల అరెస్టు

పొందూరు : మండలంలోని పెద్దబొడ్డేపల్లిలో పేకాట ఆడుతున్న 11 మందిని శనివారం పట్టుకున్నట్లు ఎస్‌ఐ ఎస్.లక్ష్మణరావు తెలిపారు. గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడి చేశామని అన్నారు. దాడిలో 11 మందిని పట్టుకుని వారి వద్ద గల రూ.13,680లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

పోలాకి : మండలంలో పిరువాడకు చెందిన కరణం లచ్చుమియ్య (59) పాము కాటుకు గురై మృతి చెందారు. పిరువాడలో మృతుడు లచ్చుమియ్య, భార్య జయమ్మ కుమారుడు కలిపి వ్యవసాయ కూలీగా పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే రాత్రి ఏడు గంటలు ప్రాంతంలో ఊరి చివర ఆలయం వద్ద కూర్చుని తిరిగి ఇంటికి వస్తున్నాడు. మార్గమధ్యంలో పాము కాటు వేసింది. వెంటనే కుటుంబ సభ్యులు నరసన్నపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. మృతుడి భార్య జయమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్‌ఐ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జింక మృతి

ప్రజాశక్తి- పలాస

మండలంలోని రామకృష్ణాపురం రెవెన్యూ పరిధిలో కోసంగిపురం కూడలి జగనన్న కాలనీలో శనివారం రాత్రి జింక మృతి చెందింది. అటవీ శాఖ అధికారులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జగనన్న కాలనీ సమీపంలో రిజర్వు ఫారెస్టు ఉంది. ఫారెస్టు నుంచి జింక తప్పి జనసాంద్రతలోనికి వస్తుంది. ఈ క్రమంలో కుక్కలు వెంట బెట్టడంతో పరుగులు తీసి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలకు మున్సిపాలిటీ అధికారులు నిర్మించిన నీటి కుండీలోకి వచ్చి పడింది. దీంతో స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. పలాస అటవీ రేంజర్ మురళీకృష్ణతో పాటు సిబ్బంది రాజు, సంతోష్, కృష్ణారావులు చేరుకొని నీటి కుండీలో ఉన్న జింకను బయటకు తీశారు. అడవిలో విడిచి పెట్టేందుకు తమ వాహనంలో తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. అప్పటికే కుక్కలు దాడి చేసిన ఘాట్లు ఉన్నాయని పశుసంవర్ధకశాఖ ఎడి పోతనపల్లి చంద్రశేఖర్ తెలిపారు. అనంతరం జింకకు పోస్టుమార్టం నిర్వహించి అంత్యక్రియలు నిర్వహించారు.



మృతి చెందిన జింక

పిజి సెట్‌లో విద్యార్థుల సత్తా



కాకినాడ ఆదిత్య విద్యార్థులు

శ్రీకాకుళం అర్బన్ : ఇటీవల విడుదలైన పిజి సెట్‌లో నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ తెలిపారు. ఈ మేరకు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు శనివారం ప్రశంసించారు. కెమిస్ట్రీలో రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు టి.రాజశేఖర్, కంప్యూటర్స్‌లో సీపాన కవిత 5, సిహెచ్.రామకృష్ణ జువాలజీలో 8, ఎన్.జె.అశోక్‌తేజ కెమిస్ట్రీలో 12, డి.అక్షయ్‌కుమార్ ఇంగ్లీషులో 14, ఎస్.కిషోర్ బాటనీలో 24, ఎ.మన్మథరావు బోటనిలో 30, పవన్ వర్మ ఇంగ్లీష్‌లో 41, జువాలజీలో ఎస్.లిఖిత 57, పి.శివపావని 63, జి.నీలయ్య, తెలుగు 79, బి.హేమలత తెలుగు 101, డి.మేఘన తెలుగు 437, పొలిటికల్ సైన్స్‌లో ఇ.శివకుమార్ 547, కె.రమాదేవి 131, డి.వాసు 476వ ర్యాంకులు సాధించారని అన్నారు.

మహిళా కళాశాలలో..

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వంగ బ్రాహ్మణి స్పెషల్ ఇంగ్లీష్‌లో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాదించగా, గణితంలో జామి శిరీష ఆరో ర్యాంకు సాధించారు. స్పెషల్ ఇంగ్లీష్‌లో రాష్ట్రస్థాయిలో భవిరిశెట్టి చేతన 10వ ర్యాంకును దక్కించుకుంది. వీరితో పాటు జూలజీ విభాగంలో 12మంది, వృక్షశాస్త్రంలో ఆరుగురు, గణితంలో 12మంది, భౌతికశాస్త్రంలో నగులురు, రసాయన శాస్త్రంలో ఆరుగురు, కంప్యూటర్ సైన్స్‌లో నలుగురు వందలోపు ర్యాంకులు సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు తెలిపారు.

కాకినాడ ఆదిత్యలో..

నగరంలోని కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎపి పిజి సెట్‌లో ఫలితాల్లో వంద లోపు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు కళాశాల డైరెక్టర్ బి.ఎస్.చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో స్టాటిస్టిక్స్ విభాగంలో బొడిగి చంద్రిక, మాడుగుల ద్రాక్షయని 16వ, 67వ, ఎలక్ట్రానిక్స్ విభాగంలో వరుసగా 42, 51, పొదిలాపు అశ్విని, ముద్దాడ రేవతి సాధించారన్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో తోణంగి మీనాక్షి 81వ ర్యాంకు కైవసం చేసుకుతందని తెలిపారు.



పట్టాను అందజేస్తున్న విసి వెంకట సుబ్బయ్య

నిరంతర శ్రమే విజయానికి సోపానం

జెఎన్‌టియుజివి వైస్ ఛాన్సలర్ వెంకట సుబ్బయ్య

టెక్కలి రూరల్: ఏ రంగంలోనైనా విజయం సాధించాలంటే నిరంతరం శ్రమపడాల్సిందేనని విజయనగరం జెఎన్‌టియుజివి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ కె.వెంకట సుబ్బయ్య అన్నారు. టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఏడో పట్టభద్రుల దినోత్సవ వేడుకలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఇంజినీంగ్, పిజి పట్టభద్రులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవితంలో అనేక సవాళ్లు ఎదుర్వోఆల్సి వస్తోందని, కావాల్సినన్ని అవకాశాలు ఉన్నాయని అన్నారు. సమాజంలోని సమస్యలను గుర్తించి సాంకేతిక పరిష్కారాలు చూపాలని హితవు పలికారు. నిరంతరం కొత్త అంశాలను నేర్చుకోవడం, ఇతరులతో మంచి సత్సంబంధాలు కలిగి ఉండడం, నెట్‌వర్క్‌ను ఉపయోగిస్తూ సాఫ్ట్‌స్కిల్స్ వంటి సుగుణాలను ప్రతివ్యక్తీ అలవర్చుకోవాలన్నారు. ఐతమ్ బిఒజి చైర్మన్‌గా వ్యవహరించిన ఎచ్చెర్ల డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ కూన రాంజీ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ మిషన్ లెర్నింగ్ రంగానికి ఉజ్వల భవిష్యత్ ఉందన్నారు. పట్టభద్రుల దినోత్సవం సందర్భంగా 788 బిటెక్ పట్టాలను, 35 పిజి పట్టాలను, ఏడుగురికి బంగారు పతకాలను అందజేస్తున్నట్టు తెలిపారు. ఆదిత్య ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కె.సోమేశ్వరరావు కళాశాల వార్షిక నివేదికను సమర్పించారు. ఈ ఏడాది కళాశాలకు వచ్చిన 74 ప్రముఖ కంపెనీల్లో 1200కు పైగా విద్యార్థులు ఆకర్షనీయమైన వేతనాలతో ఉద్యోగాలు సంపాదించారన్నారు. కార్యదర్శి ఎల్.ఎల్.నాయుడు వందన సమర్పన చేశారు. కార్యక్రమంలో కోశాధికారి టంకాల నాగరాజు, డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు, సొసైటీ డైరెక్టర్లు కొంచాడ మధుకుమార్, టంకాల నాగశేషు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ డాక్టర్ వి.చిట్టిబాబు పాల్గొన్నారు.

బాహుదా వంతెన పనులు ప్రారంభం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణంలో భారీ ట్రైలర్ వాహనం రావడంతో మే 3న కుప్ప కూలిన బాహుదా రోడ్డు వంతెన పనులు శనివారం పున:ప్రారంభమయ్యాయి. కూలిన వెంటనే ప్రభుత్వం, కలెక్టర్ తాత్కాలిక వంతెన నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరు చేశారు. దీంతో కూలిన శిథిలాలు తొలగింపు చేపట్టారు. ఆ తర్వాత సాంకేతిక కారణాలతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. తాత్కాలిక వంతెన నిర్మాణానికి అవసరమైన నిధులు ఇంకా అవసరం కావడంతో రహదారులు భవనలశాఖ అధికారులు అదనంగా రూ.20 లక్షలు రివైజాడు అంచనాలతో ఆమోదం కోసం పంపించారు. ఇంతలో ప్రజలు, వాహనదారుల నుంచి ఒత్తిడి రావడంతో ఉన్న నిధులతో తాత్కాలిక వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టారు. రహదారులు భవనలశాఖ ఇంజినీర్ మోహనరావు పర్యవేక్షణలో నిర్మాణ పనులు చేపడుతున్నారు. సీడాప్ ఎపి చైర్మన్ శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి నిర్మాణ పనులను పరిశీలించి వేగవంతం చేయాలని ఆదేశించారు.



పనులను పరిశీలిస్తున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

మెట్టూరు పిహెచ్‌సి ప్రారంభం

కొత్తూరు : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని మెట్టూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పిహెచ్‌సి పరిధిలో 45 వేల మంది ప్రజలకు వైద్య సేవలు అందుతాయని అన్నారు. నియోజకవర్గంలోని రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. అనంతరం బమ్మిడిలో నిర్వహించిన జగనన్న సురక్షలో పాల్గొని లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి కె.భాగ్యవతి, ఎంపిడిఒ పావని, వైసిపి నాయకులు సారిపల్లి రపసాదరావు, పిఎసిఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, మెట్టూరు సర్పంచ్ మొజ్జాడ రుక్మిణి, సర్పంచ్‌లు వి.అరుణకుమారి, కుంచాల రత్నాలు, నాస బాలకృష్ణ, వి.సూర్యనారాయణ, బి.రామకష్ణ, పంకాజ్ దాస్ పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

'ఆశా'ల ధర్నాను విజయవంతం చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

కొత్తూరు : ఈ నెల 18న డిఎంహెచ్‌ఒ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ఆశా కార్యకర్తల ధర్నాను విజయవంతం చేయాలని ఎపి వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్‌గౌరమ్మ, కె.జోత్స్న, పి.విజయమ్మ, కె.నిర్మల పిలుపునిచ్చారు. స్థానిక పిహెచ్ వైద్యులు శ్రీలతను శనివారం కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశలకు సంబంధం లేని పనులు చేయిస్తున్నారని అన్నారు. 2జి సిమ్ ఇవ్వడం వల్ల నెట్‌వర్క్ సమస్య తలెత్తుందన్నారు. 14 రకాలు యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకుని 26 రకాల రికార్డులు రాయవడంతో సమయం సరిపోవడం లేదని వాపోయారు. అందుకు నాణ్యమైన 4జి సెల్‌ఫోన్లు ఇచ్చిన దానిపై శిక్షణ ఇవ్వాలని కోరారు. సెలవులు, మెడికల్ లీవ్ గ్రూపు ఇన్స్యూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. అధికారులు, నాయకుల నుంచి వేధింపు, బెదిరింపులు ఎక్కువగా కావడంతో మానసిక వేదనకు గురవుతున్నామన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. వీరితో పాటు ఆశాలు పద్మ, భవాని, నిర్మల, శ్రీలేఖ, కుమారి, ధనలక్ష్మి ఉన్నారు.

నిజాయితీకి నిలువుటద్దం తిలక్


ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నీతి, నిజాయితీలకు నిలువుటద్దంగా స్వాతంత్ర్య సమరయోధులు, తొలి పార్లమెంట్ సభ్యులు కందాళ సుబ్రహ్మణ్య తిలక్ నిలుస్తారని విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ నిక్కు అప్పన్న, గాంధీ స్మారకనిధి రాష్ట్ర ప్రతినిధి మేడూరి ప్రసాదరావు అన్నారు. నగరంలోని గాంధీ మందిరంలోని తిలక్ 103వ జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు. ముందుగా ఆయన విగ్రహానికి పూలమాలలు నివాళ్లర్పించారు. స్వాతంత్ర్యానంతరం జరిగిన తొలిపార్లమెంట్ ఎన్నికల్లో జవహర్ లాల్ నెహ్రూ తర్వాత లక్షా 65 వేల ఓట్ల మెజార్టీతో ఎంపీగా తిలక్ గెలుపొంది దేశంలో చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు. సోషలిస్టుగా చివరి వరకు నీతి, నిజాయితీలతో జీవితం గడిపారని అన్నారు. కార్యక్రమంలో గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు డాక్టర్ జామి భీమశంకర్, బరాటం లక్ష్మణరావు, కొంక్యాన వేణుగోపాల్, మెట్ట అనంతం భట్లు, పందిరి అప్పారావు, నక్క శంకరరావు, గుత్తు చిన్నారావు, శాస్త్రి పాల్గొన్నారు.

ఒబిసి సాధనకు పోరాటం

కోటబొమ్మాళి: కళింగ కోమటిలను ఒబిసిలో చేర్చేవరకు మనమంతా కలికట్టుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పోరాడుదామని టిడిపి రాష్ట్ర కన్వీనర్, కళింగ కోమటి బిసి సాధికారిక కమిటీ కార్యదర్శి బోయిన గోవిందరాజులు అన్నారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సోమవారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న స్పందనలో వినతిపత్రం అందజేస్తామని అన్నారు. నాలుగు జిల్లాల చెందిన నాయకులు పాల్గొవాలని కోరారు.

బదిలీ ఉపాధ్యాయునికి సన్మానం



సన్మానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని తండ్యాం పంచాయితీలోని శ్రీరామనగర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు మొదలవలస వెంకటరమణను శనివారం స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటరమణ దంపతులకు జ్ఞాపికలను అందజేసి దుశ్శాలువ కప్పి సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి కిల్లారి భాస్కరరావు, ఎంపిటిసి ప్రతినిధి వడగా మోహనరావు, ప్రధానోపాధ్యాయులు అల్లంశెట్టి రవి, ఉపాధ్యాయులు చౌదరి మల్లేశ్వరరావు, అల్లంశెట్టి షణ్ముఖరావు, రామచంద్రరావు, సుందరరావు, రమణ పాల్గొన్నారు.

బదిలీ సర్వేయర్లకు...

కవిటి: విధి నిర్వహణలో చేరిన అనతికాలంలోనే పి.ఈశ్వరమ్మ, కడగల సురేష్ అపార అనుభవాన్ని సంపాదించారని సర్పంచ్ పూడి లక్ష్మణరావు అన్నారు. కవిటి సచివాలయం–1,3 పరిధిలో గత నాలుగేళ్లుగా సర్వేయర్లుగా పనిచేసి బదిలీపై వెళ్లిన ఈశ్వరమ్మ, సురేష్‌లకు శనివారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెవెన్యూ విభాగంలో సర్వేయర్లుగా పనిచేయడం అంత సులువైన విషయం కాదని, చిన్న వయసులోనే ఈశ్వరమ్మ, సురేష్ మంచి అనుభవాన్ని సంపాదించి మండలంలో అందరితో కలిసిపోయారని అన్నారు. భవిష్యత్‌లో వీరు మరింత మెరుగైన పనితీరు కనపరిచి ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపిటిసి పూడి నీలాచలం, ఉపసర్పంచ్ ప్రతినిధి దేవాడ దుర్యోధన, ఇఒ జి.రవీంద్రస్వామి పాల్గొన్నారు.



కవిటి : సన్మానిస్తున్న సర్పంచ్ లక్ష్మణరావు

ధర్మాన... మీకిది తగునా?

సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్


గొండు శంకర్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, నవ్యాంధ్రలోనూ మూడు పర్యాయాలు రాష్ట్ర మంత్రిగా వ్యవహరించిన రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాటలు అర్ధరహితంగా, ఆక్షేపణీయంగా ఉన్నాయని టిడిపి నాయకులు, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం రూరల్ కిష్టప్పపేటలోని పంచాయతీ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమానికి వచ్చిన మంత్రి ధర్మాన ప్రసాదరావు దృష్టికి ఫ్లోరైడ్ సమస్య తీసుకెళ్లి తాగునీరు అందించాలని కోరితే మీరు ఓట్లు వేయరు కానీ, మీకు పనులు చేయాలా అని ప్రశ్నించడం తగునా అన్నారు. 2019లో కిష్టప్పపేటలో 1350 ఓట్లు పోలైతే, 530 ఓట్లు ధర్మానకు వేశారని, వారు వేసింది ఓట్లు కావా? అని ప్రశ్నించారు. మూడు పర్యాయాలు రాష్ట్ర మంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న ధర్మాన నోటి వెంట ఇటువంటి వ్యాఖ్యలు రావడం బాధాకరమన్నారు. ఆయనలో అభద్రతా భావం బయట పడుతోందన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపికే విజయం వరిస్తుందన్నారు.


పోలాకి : వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న లక్ష్మీతులసి

'ఫ్యామిలీ డాక్టర్' సందర్శన

పోలాకి: మారుమూల గ్రామాలకు సైతం ఆధునిక వైద్య సేవలు అందించే ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నోడల్ అధికారి, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మీతులసి పిలుపునిచ్చారు. మండలంలోని గుప్పెడుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సత్రావుపేటలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ శిబిరాన్ని శనివారం సందర్శించారు. రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. శిబిరానికి వచ్చే రోగుల వివరాలన్నీ ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాలని డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో గుప్పిడిపేట పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ చందనం, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వాన సురేష్‌కుమార్, సిహెచ్ఒ దివ్య, ఎఎన్ఎం ఈశ్వరమ్మ, ఎహెచ్ బి.రామకృష్ణ పాల్గొన్నారు.

దేపల్లివానిపేటలో 'ఫ్యామిలీ ఫిజీషియన్'

సంతబొమ్మాళి : మండలంలోని బోరుభద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి మలగాం పంచాయతీ దేపల్లివానిపేటలో వైద్యాధికారి పి.అవని ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా 50 రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు బిపి,సుగర్, థైరాయిడ్ జ్వరం, కండ్ల కలకలు వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం హెచ్.పి.జ్యోతి, అప్పలనర్సమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న అనూష

ఉత్పత్తుల మార్కెటింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రకృతి సాగు ఉత్పత్తుల మార్కెటింగ్‌పై రైతులకు ప్రకృతి విభాగం రాష్ట్ర రీజనల్ కౌన్సిలర్ అనూష ఆధ్వర్యాన నిమ్మతొర్లాడలో శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పూర్తిగా ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలను పండిస్తే... వివిధ రకాల ఉత్పత్తులకు లోకల్ మార్కెట్ నుంచి జాతీయ మార్కెట్ వరకు మంచి ఆదరణ ఉందన్నారు. గ్రామంలోని రైతులు ఎక్కువగా బెల్లం ఉత్పత్తి చేస్తారని, రైతు ప్రకృతి సాగు ధ్రువీకరణ పత్రాన్ని పొందినట్లయితే ఆ రైతు పంట ఉత్పత్తి అనేది ఆన్‌లైన్‌లో మార్కెటింగ్‌లో కాని, వివిధ రకాల పోర్టల్‌లో సులువుగా అమ్ముకోవడానికి వీలుగా ఉంటుందని వివరించారు. ప్రకృతి సేద్య విధానంలో పండించిన ఉత్పత్తులకు కొనుగోలుదారులు మంచి ఆదరణ చూపిస్తున్నారని అన్నారు. పంటలకు ఎక్కువ ధర ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మార్కెటింగ్ సిబ్బంది శివాజీ, చిన్నమ్మడు, శోభన్, మండల యాంకర్ చిరంజీవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిపిఎం నారాయణరావు

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మహిళలు ఆర్థికంగా పరిపుష్టి చెందినప్పుడే ఆ కుటుంబాల జీవన స్థితిగతులు మెరుగుపడతాయని డిఆర్‌డిఎ డిపిఎం నారాయణరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రధానమంత్రి యోజన గ్రామీణ పథకం ద్వారా వెలుగు ఆధ్వర్యాన టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, సారవకోట, మహిళలకు రుణమేళ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి మహిళా రుణాలు తీసుకుని గ్రామాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, అలాగే సర్వీస్ సెక్టార్ యూనిట్లకు లోన్ అందజేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ డిపిఎం నాగలక్ష్మి, ఏరియా కో-ఆర్డినేటర్ శిష్టు శ్రీరాములు, ఎపిఎం గురుగుబెల్లి నారాయణ రావు, ఐదు మండలాల ఎపిఎంలు, సిసిలు, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

బిసిల సమస్యలు పరిష్కరించాలి

ఇచ్ఛాపురం : బిసిల సమస్యలను పరిష్కరించాలని బిసి చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులు బి.సి.రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిసి కుల జనగణ వెంటనే చేపట్టాలన్నారు. బిసిల జనాభా దామాషా ప్రకారం చట్ట సభలో స్థానిక సంస్థల్లో విద్య, ఉద్యోగ రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బిసిల రక్షణ కోసం చట్టాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఐ అధ్యక్షులు తురక వెంకట్, ఇచ్ఛాపురం ప్రెసిడెంట్ ఇప్పిలి అప్పలస్వామి, బిసి చైతన్య సమితి పలాస ప్రెసిడెంట్ దట్టి అఖిలేష్, దాసరి రాజు, బచ్చు జగన్, ఆశి లీలారాణి, కోట రామారావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'గడప గడపకు'

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రజా సమస్యల పరిష్కారానియేశీ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పురపాలక సంఘ పరిధిలోని 9వ వార్డు పరిధిలోని గొల్లవీధి, అమ్మానగర్, బనియన్ల ఫ్యాక్టరీ వీధి, ముస్లిముల కాలనీల్లో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలన్నారు. సాంకేతికపరమైన సమస్యలతో సంక్షేమ పథకాలు అందకపోతే సమీపంలోని సచివాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని లబ్ధిదారులకు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రవి సుధాకర్, వైసిపి యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, సచివాలయాల కో-ఆర్డినేటర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, టౌన్ పార్టీ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు పాల్గొన్నారు.


లావేరు : సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ప్రజాసంక్షేమమే ధ్యేయం

లావేరు : ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ధ్యేయంగా పనిచేస్తున్నారని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని లావేరు పంచాయతీ జి.జి.వలస, కేశవరాయపురం గ్రామాల్లో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పోస్టర్లను అందజేశారు. అనంతరం గ్రామంలోని, వ్యక్తిగత సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, సచివాలయాల మండల కన్వీనర్ మీసాల శ్రీనివాసరావు, ఎంపిటిసి ఇనపకుర్తి సతీస్ పాల్గొన్నారు.

నేడు టిడిపి బస్సు యాత్ర

పలాస: వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి రాష్ట్రంలో చేస్తున్న అక్రమాలు, దౌర్జన్యాలు, అవాస్తవాలను వివరించేందుకే టిడిపి బస్సు యాత్ర చేపడుతుందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. పలాస టిడిపి కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. పలాస నియోజకవర్గంలో ఆదివారం ఉదయం పది గంటల నుంచి రాత్రి వరకు పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాల్లో టిడిపి జిల్లా నాయకులతో బస్సు యాత్ర నిర్వహిస్తున్నమని చెప్పారు. బస్సు యాత్రకు టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం నిర్వహించనున్న టిడిపి బస్సు యాత్రను విజయవంతం చేయాలని టిడిపి మున్సిపాలిటీ అధ్యక్షుడు బడ్డ నాగరాజు కోరారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సమస్యలపై పోరాటం చేసి, వైసిపి అరాచక పాలనను అంతమొందించాడానికి టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆధ్వర్యాన బస్సు యాత్ర ద్వారా ప్రజలను చైతన్యపరుస్తున్నామని అన్నారు. నియోజకవర్గ పరిధిలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు తరలిరావాలని కోరారు.

మందస : మందస మండలంలో మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్న బస్సు యాత్రిను విజయవంతంచేయాలని టిడిపి మండల అధ్యక్షులు భావన దుర్యోధన కోరారు. కార్యక్రమంలో డొంకురు తిరుపతి, రట్టి లింగరాజు, రాజాన మహేష్, గార కృష్ణారావు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

కవిటి: పంచాయతీలో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు సర్పంచ్ పూడి ప్రసాదరావు తెలిపారు. మండలంలోని జగతి పంచాయతీ బడ్డవీధి నుంచి శిలగాం రహదారికి అనుసంధానం చేస్తూ రూ.లక్ష పంచాయతీ నిధులతో రోడ్డు నిర్మాణ పనులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీలో పూర్తిస్థాయిలో రోడ్డు పనులు చేపడుతున్నట్టు తెలిపారు. ఉప సర్పంచ్ చీకటి భూపతిరాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పేదలకు అందుబాటులోకి వైద్య సేవలు

శాసనసభ స్పీకర్ సీతారాం

ఆమదాలవలస : పేదలకు అందుబాటులోకి వైద్య సేవలను తీసుకురావడమే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ధ్యేయమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం పక్కనే వంశధార గెస్టుహౌస్‌లో ఆస్పత్రి నిర్మాణానికి సంబంధించి చేపడుతున్న పనులను అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణానికి ఆమడ దూరంలో ఉన్న జొన్నవలస సిహెచ్‌ని త్వరలో వంశధార గెస్టుహౌస్‌కు తరలించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఐదు ఎకరాల 30 సెంట్లు విస్తీర్ణం గల ఈ స్థలంలో సిహెచ్‌సి నిర్మాణానికి ప్రభుత్వానికి నివేదించగా. ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. నిర్మాణాలకు అవసరమయ్యే నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. మంజూరైన నిధులతో పాత భవనాల ఆధునికీకరణ, కొత్త భవన నిర్మాణాలు శరవేగంగా చేపడుతున్నట్లు తెలిపారు.


అధికారులతో మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ లక్ష్యాలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పనులు పూర్తయిన వెంటనే సిహెచ్‌సిని ఇక్కడకు తరలిస్తామని తెలిపారు. ఆరోగ్య ఆమదాలవలస నిర్మాణమే తన లక్ష్యమని అన్నారు. ప్రతి గ్రామంలోనూ శత శాతం వైఎస్‌ఆర్ విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేసేందుకు భవన నిర్మాణాలకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సరుబుజ్జిలి ఎంపిపి ప్రతినిధి కె.వి.జి.సత్యనారాయణ, మున్సిపల్ ఎఇ కె.అప్పలనాయుడు పాల్గొన్నారు.

డయాలసిస్ కేంద్రానికి అదనపు బెడ్లు మంజూరు


సమావేశంలో మాట్లాడుతున్న అరవింద్

ప్రజాశక్తి- పలాస

పలాస డయాలసిస్ కేంద్రానికి అదనంగా రెండు బెడ్లు మంజూరు చేస్తున్నట్లు డయాలసిస్ యూనిట్ ఎపి జోనల్ ఇన్‌ఛార్జి అరవింద్ తెలిపారు. పలాస ప్రభుత్వాస్పత్రిని శనివారం సందర్శించారు. ముందుగా డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించి డయాలసిస్ రోగులతో మాట్లాడారు. ఆస్పత్రిలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారా? తదితర అంశాలను రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ డయాలసిస్ యూనిట్‌లో చిన్న చిన్న లోపాలను సరిచేస్తున్నామని అన్నారు. డయాలసిస్ కేంద్రానికి వచ్చే రోగులు అధికంగా ఉండటం వల్ల అదనంగా మరో 2 డయాలసిస్ బెడ్లు, అదనపు సిబ్బందిని మరో 10 రోజులలో ఏర్పాటు చేస్తానని చెప్పారు. సమావేశంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీర్ భవానీశంకర్, సూపరింటెండెంట్ డాక్టర్ మేఘన, డయాలసిస్ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సత్యసుభాష్, కౌన్సిలర్ సవర సోమేష్, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

పలువురికి ఆర్థికసాయం


సంతబొమ్మాళి : ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

సంతబొమ్మాళి : బ్రెయిన్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న లాభినాన ఏకబుకు సంతబొమ్మాళి యువజన సేవా సంఘం, సిక్కోలు సేవా సమితి సభ్యులు రూ.30,700 ఆర్థిక సహాయం చేశారు. సంతబొమ్మాళికి చెందిన లఖినాన ఏకబు చాలా వరకు డబ్బులు వెచ్చించి శస్త్ర చికిత చేయించుకున్నారు. కానీ, ఇంకా నయం కాకపోవడంతో చెన్నైలో ఆస్పత్రిని సంప్రదిస్తే మరలా సర్జరీ చేయాలని సూచించారు. ఆపరేషన్‌కు రూ.4 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పడంతో వారి కుటుంబం నిరాశతో ఉన్నారు. విషయం తెలుసుకున్న యువజన సేవా సంఘం సభ్యులు, సిక్కోలు సేవా సమితి సభ్యులు దాతలను నగదు సేకరించి అందజేశారు. కార్యక్రమంలో అట్టాడ సాయికుమార్, కూచిట్టి భానుప్రకాష్, అచ్యుతా రావు, మధు, రాము, నరేష్, లోకేష్, మల్లేష్ పాల్గొన్నారు.

జనసైనికులు...

పొందూరు: కొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న లైదాంకు చెందిన చిన్నారి లొట్ట సింహాద్రికి జనసైనికులు ఆర్థిక సాయం అందించారు. ఆముదాలవలస నియోజకవర్గం జనసేనపార్టీ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు రూ.11,000 నగదును అందించారు. బాలుడు దుస్థితిని పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు వై.రమణ, సూర్య, మోహన్, వెంకట్, సురేష్, గోవింద, భాస్కర్ పాల్గొన్నారు.


పొందూరు : ఆర్థికసాయం అందజేస్తున్న రామ్మోహనరావు

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో కొత్తపారసాంబలో ముత్యాలు పోలమ్మ ఆలయ నిర్మాణానికి స్థానిక ఎస్‌పివి ఆస్పత్రి గ్రూప్ చైర్మన్ తమలంపూడి శ్రీనివాస్‌రెడ్డి రూ.20 వేలు ఆర్థికసాయం అందించారు. ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ప్రతినిధి ఎస్.రవి, ఆలయం అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు పవన్ క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

వాలంటీర్ వ్యవస్థపై జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు తక్షణమే క్షమాపణ చెప్పాలని మండల వాలంటీర్లు డిమాండ్ చేశారు. వజ్రపుకొత్తూరు బస్టాండ్ ఆవరణలో శనివారం మానవహారం నిర్వహించి పవన్ కళ్యాణ్ అనుచిత వ్యాఖ్యలకు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వాలంటీర్లు మాట్లాడుతూ గౌరవ వేతనంతో ప్రజలను సేవ చేస్తున్నామే తప్ప రాజకీయాలతో ఎటువంటి సంబంధం లేదన్నారు. వాలంటీర్ వ్యవస్థపై వ్యాఖ్యలు చేసే ముందు పవన్ కళ్యాణ్‌కు క్షేత్రస్థాయిలో వాలంటీర్ల పనితీరు, వాలంటీరు వ్యవస్థపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. అనంతరరం తహశీల్దార్ అప్పలస్వామికి, ఎంపిడిఒ సిహెచ్.ఈశ్వరమ్మలకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిన శ్రీనివాసరావు, ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు దువ్వాడ మధుకేశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షులు పుక్కళ్ల గురయ్యనాయుడు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.


మానవహారం నిర్వహిస్తున్న వాలంటీర్లు

ఆక్రమణలు అడ్డగింత

ప్రజాశక్తి- పొందూరు

మండల కేంద్రంలోని సర్వే నంబరు 6,7లోని దేవస్థానం భూముల ఆక్రమణలను శనివారం రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారు. లక్ష్మీపేటకు వెళ్లే రహదారిలోని దేవస్థానం భూములను కొందరు ఆక్రమించి చదును చేసుకుంటున్నారు. ఇవి దేవస్థానం భూములను గుర్తించిన స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. దీంతో విఆర్‌ఒలు వేణు, రేవతిరావులు ఆక్రమిత స్థలంలో చేపడుతున్న పనులను నిలుపుదల చేయాలని ఆదేశించారు. భూమికి సంబంధించిన పత్రాలు ఉంటే సోమవారం తహశీల్దార్ ముందు ఉంచాలని, అంతవరకు పనులు నిలుపుదల చేయాలని ఆదేశించారు. లక్ష్మీపేటకు వెళ్లే రహదారిలో సర్వే నంబరు 6/1 నుంచి 6/26 వరకు 60 సెంట్లు దేవస్థానం రస్తా భూములు ఉన్నాయి. ఈ భూములకు ఆలనా పాలనాలేకపోవడంతో ఆక్రమణలకు గురవుతున్నాయి. యథేచ్ఛగా భూములు ఆక్రమణలకు గురవుతున్నా దేవస్థానం అధికారులు పట్టించుకోక పోవడంతో ఆక్రమణదారులు పెచ్చిమీరుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

కవిటి: మండలంలోని మణిక్యపురం 11 కెవి, ఆర్‌డబ్ల్యుఎస్ 11 కెవి ఫీడర్ల పరిధిలోని రోడ్డు మార్గంలో ఉన్న పాత విద్యుత్ స్తంభాలను ఆదివారం తొలగిస్తున్నామని, ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు పలాస ఇఇ జి.ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. వీటి పరిధిలోని వరక, కుసుంపురం, బల్లిపుట్టుగ, మణిక్యపురం పంచాయతీ వినియోగదారులు సహకరించాలని కోరారు.

టెక్కలి రూరల్ : టెక్కలి టౌన్-1 ఫీడర్ టెక్కలి టౌన్ 2 ఫీడర్ 11 కెవి వైర్లపై ఉన్న చెట్టు కొమ్మలు తొలగించడానికి ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపుదల చేయనున్నామని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులందరూ గమనించి సహకరించాలని కోరారు.

కాశీనగర్‌లో 'రాజారాణి' నిలుపుదల

పర్లాకిమిడి : గజపతి జిల్లా కాశీనగర్‌లో రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం రెండు నిమిషాలు పాటు నిలుపుదల చేశారు. కొన్నేళ్లుగా పలు ప్రజా సంఘాల నాయకులు దీక్షలు, ధర్నాలు, అభ్యర్థుల మేరకు ఎట్టకేలకు రాజారాణి ఎక్స్‌ప్రెస్ కాశీనగర్‌లో నిలిపేందుకు రైల్వే అధికారులు అంగీకరించారు. దీంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేశారు.



రైలు ఎక్కుతున్న ప్రయాణికులు


ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న కమిటీ సభ్యులు

తీరంలో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం భావనపాడు సముద్రంలో సర్పంచ్ బి.మోహన్‌రెడ్డి, సముద్ర తీర పరిరక్షణ కమిటీ ఆధ్వర్యాన తీరంలోని ప్లాస్టిక్ వ్యర్థాలను శనివారం తొలగించారు. సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, ఎఎన్ఎంలు, ఉపాధి మేట్లు, డ్వాక్రా మహిళలు, యువకులతో టెక్కలి డిఎల్‌పిఒ ఐ.వి.రమణ కమిటీని ఏర్పాటు చేశారు. అనంతరం సముద్ర తీరంలోని ప్లాస్టిక్ ఇతర హానికర వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా డిఎల్‌పిఒ మాట్లాడుతూ జీవవైవిధ్యం పర్యావరణ పరిరక్షణకు నిత్యం ఎలాంటి కార్యక్రమం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి శశిభూషణరావు, పంచాయతీ కార్యదర్శి బి.వి.రాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు పోలాకి మండల సమావేశం

పోలాకి : ఈ నెల 17న మండల సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ ఉషశ్రీ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. మధ్యాహ్నం 2 గంటలకు ఎంపిపి ముద్దాడ దమయంతి అధ్యక్షతన నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సమావేశానికి విధిగా ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొవాలన్నారు. అధికారులు పూర్తి సమాచారం హాజరుకావాలన్నారు.


చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న సిబ్బంది

బి.ఎస్ రావుకు నివాళి

పలాస : పలాస స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో సంస్థ చైర్మన్ డాక్టర్ బి.ఎస్.రావు మృతి సందర్భంగా పాఠశాల ఆవరణలో శనివారం సంస్మరణ సభ ఏర్పాటు చేశారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎర్ర రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

రేషన్ డిపో తనిఖీ

కోటబొమ్మాళి: మండలంలోని నారాయణవలస పంచాయతీలో రేషన్ డిపోలో జిల్లా విజిలెన్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి.సింహాచలం శనివారం తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో 427 కిలోల పిడిఎస్ బియ్యం స్టాక్ తక్కువ ఉండడాన్ని గుర్తించి డీలర్‌పై కేసు నమోదు చేశామన్నారు. అయితే ప్రభుత్వం నుంచి రేషన్ డిపోలకు సరఫరా చేస్తున్న బిడిఎస్ బియ్యం బస్తాల్లో ఒక్కో బస్తాకు మూడు నుంచి నాలుగు కిలోల బియ్యం తక్కువగా రావడమే తమ వద్ద ఉన్న స్టాకుకు తక్కువ చూపిస్తున్నాయని సంబంధిత డిపో యజమాని విజిలెన్స్ అధికారులకు తెలిపారు. దీనిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని సింహాచలం తెలిపారు. దాడుల్లో సిఎస్‌డిటి కె.రాము, విఆర్‌ఒ కె.భాస్కరరావు పాల్గొన్నారు.

రేపు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

టెక్కలి : జిల్లా వ్యాప్తంగా ఉన్న వికలాంగుల సమస్యలు పరిష్కారంలో ప్రభుత్వం, అధికారులు అలక్ష్యం చూపుతున్నారని, ఈ సమస్యలు పరిష్కారానికి పోరాటమే ఏకైక మార్గమని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఉపాధ్యక్షులు ఆవుల వేణుగోపాలరావు అన్నారు. ఈ మేరకు శనివారం విలేకరులతో మాట్లాడారు. ఇందులో భాగంగా సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపడుతున్నామని తెలిపారు. వికలాంగులకు నెలకు రూ.6 వేలు ఫించన్ మంజూరు చేయాలని పలుమార్లు కోరామన్నారు. అయినా ప్రభుత్వం, అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మార్లు కొరినప్పటికీ స్పందించడం లేదన్నారు. నియోజకవర్గంలోని వికలాంగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.


మాట్లాడుతున్న శర్మ

కనీస పెన్షన్‌కు ఉద్యమిద్దాం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కనీస పెన్షన్ కోసం ఉద్యోగులు ఉద్యమించాలని విశ్రాంత ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.ఎస్.ఆర్.శర్మ పిలుపునిచ్చారు. నగరంలోని విశ్రాంత ఉద్యోగుల కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఆర్.పి.రావు అధ్యతన శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్‌టిసిలో పనిచేస్తూ 2014 ముందున్న వారికి పెన్షన్ పొందే అవకాశం లేదని, అయితే హయ్యర్ పెన్షన్‌దార్ల దరఖాస్తుల్లో లోపాలను ఉన్నట్లయితే వాటిని సరిదిద్దుకునేందుకు వీలుందని అన్నారు. ఈ అవకాశాన్ని విశ్రాంత ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడును కలిసి ఈ సమస్యపై వినతిపత్రం ఇవ్వాలని తీర్మానించారు.